

చీనీ టన్ను రూ.17,100
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17,100, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.34
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.34, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3 వేల టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
31.3°/20.8°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం నుంచి తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

10 మండలాల్లో వర్షం



జగరాజుపల్లి వద్ద కురుస్తున్న జల్లులు

పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోనూ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 10 మండలాల్లో మోస్తరు నుంచి తుంపర వర్షం కురిసింది. అమరాపురం మండలంలో 6.4 మి.మీ, కొత్తచెరువు 2.2, గుడిబండ 2.2, సోమందేపల్లి 2.2, పెనుకొండ 2, రొద్దం 1.8, బత్తలపల్లి 1.4, పుట్టపర్తి 1.4, ధర్మవరం 1.2, ముదిగుబ్బ మండలంలో 1.2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో మరో నాలుగు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వెల్లడించారు.

సేవలతో పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచాలి

- ప్రొబేషనరీ సబ్‌ఇన్‌స్పెక్టర్లకు ఎస్పీ రత్న సూచన



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రొబేషనరీ సబ్‌ఇన్‌స్పెక్టర్లు

పుట్టపర్తి టౌన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి ప్రజల్లో పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచాలని ఎస్పీ రత్న ప్రొబేషనరీ సబ్‌ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం జిల్లాకు 15 మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలను కేటాయించింది. దీంతో వీరు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నేరస్తులు, అనుమానితులపై నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే విధంగా విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో పక్షపాతం లేకుండా అందరికీ న్యాయం జరిగే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్‌ఐలు వలి, మహేష్, సోషల్ మీడియా ఎస్‌ఐ మునిప్రతాప్ పాల్గొన్నారు.

స్టీల్ ఫ్యాక్టరీలో ప్రమాదం.. కాలు కోల్పోయిన కార్మికుడు

హిందూపురం: మండల పరిధిలోని గోళ్లాపురం పారిశ్రామికవాడలోని బ్లూ గోల్డ్ స్టీల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు కుడికాలు కోల్పోయాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి కార్మికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్లూ గోల్డ్ స్టీల్స్ పరిశ్రమలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనూప్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనికి ఫ్యాక్టరీ యాజమాన్యం ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించ లేదు. సోమవారం రాత్రి విధుల్లోకి వెళ్లిన అనూప్ దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురికాగా, కుడికాలు తెగి పక్కన పడింది. విషయాన్ని గోప్యంగా ఉంచిన కంపెనీ యాజమాన్యం వెంటనే అతన్ని బెంగళూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తోంది. ఈ ఘటనపై తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ... బ్లూ గోల్డ్ స్టీల్స్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే అనూస్ అంగవికలుడయ్యాడని, అతనికి మెరుగైన చికిత్స అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. అలాగే అతను పూర్తిగా కోలుకొనే వరకూ వేతనం ఇస్తూ, కార్మిక చట్టం ప్రకారం నష్ట పరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.

నీరు పారదు.. దాహం తీరదు

పుట్టపర్తి వాసుల తాగునీటి ఆశలపై కూటమి సర్కార్ నీళ్లు చల్లింది. పట్టణ తాగునీటి అవసరాలు తీర్చేందుకు వైఎస్ జగన్ సర్కార్ రూ.100 కోట్లతో మొదలుపెట్టిన తాగునీటి పథకానికి పూర్తిగా మంగళం పాడింది. ఇప్పటికే రూ.18 కోట్ల పనులు పూర్తయిన పథకాన్ని రద్దు చేసింది. ప్రాజెక్టు అంచనాలను రూ.154 కోట్లకు పెంచి మళ్లీ టెండర్లు పిలిచింది. ఈ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో.. తమ దాహార్తి ఎప్పుడు తీరుతుందోనని పుట్టపర్తి వాసులు ఎదురుచూస్తున్నారు.

- పుట్టపర్తికి తాగునీరందించే పథకానికి గ్రహణం
- ఏఐఐబీ ఫండ్స్ రూ.100 కోట్లతో పనులు ప్రారంభించిన జగన్ సర్కార్
- ఇప్పటికే రూ.18 కోట్లతో పనులు
- రాష్ట్రంలో కూటమి కొలువుదీరాక ఆగిన ప్రాజెక్టు పనులు
- పూర్తికాని ట్రీట్‌మెంట్ ప్లాంట్.. తుప్పు పడుతున్న ఇనుము
- పాత వాటిని రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచిన సర్కార్
- కొత్త రేట్లను సాకుగా చూపి ప్రాజెక్టు విలువ రూ.154 కోట్లకు పెంపు



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న కుమ్మరపేట మహిళలు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి నడయాడిన పుట్టపర్తిలో తాగునీటికి తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రం అయ్యాక శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. పట్టణ జనాభా పెరుగుతూ వస్తోంది. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోని కాలనీవాసులు తాగునీటి కోసం రోడ్డెక్కి నిరసనకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ సర్కార్ పుట్టపర్తి తాగునీటి సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం చూపేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నిధులు రూ.100 కోట్ల వ్యయంతో తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టింది.

బుక్కపట్నం చెరువు నుంచి నీరు..

పుట్టపర్తికి నీరందించే పథకానికి జగన్ సర్కార్ సమగ్ర ప్రణాళిక రూపొందించింది. బుక్కపట్నం చెరువులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసి దాని ద్వారా నీటిని ప్రశాంతి గ్రామంలో ఏర్పాటు చేసే ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకూ సరఫరా చేయాలి. అక్కడ శుద్ధిచేసిన నీటిని మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి, బ్రాహ్మణపల్లి, ప్రశాంతిగ్రామం, పెద్ద కమ్మవారిపల్లి, ఎనుములపల్లి, చిత్రావతి గుట్ట, ఎద్దులకొండ, కర్ణాటక నాగేపల్లి తదితర 8 చోట్ల నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకులకు పంపింగ్ చేయాలి. ఆయా ట్యాంకుల నుంచి ప్రతి ఇంటికీ సరఫరా చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసింది.

18 శాతం పనులు పూర్తి..

వీలైనంత త్వరగా పుట్టపర్తి వాసుల తాగునీటి కష్టాలు తీర్చాలని భావించిన జగన్ సర్కార్ తాగునీటి పథకం పనులను శరవేగంగా చేపట్టింది. సుమారు రూ.18 కోట్లతో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులతో పాటు ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం చేపట్టింది. మొత్తంగా 18 శాతం పనులు పూర్తయ్యాక రాష్ట్రంలో ఎన్నికలు జరగడం...ఆ తర్వాత కూటమి సర్కార్ కొలువుదీరడంతో పుట్టపర్తికి నీరందించే పథకానికి గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని పట్టించుకోకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ప్రశాంతి గ్రామం సమీపంలో నిర్మిస్తున్న ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఫలితంగా కొన్ని పిల్లర్లకు, ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు వేసిన ఇనుప చువ్వలు తుప్పు పట్టాయి. ఇక నిర్మాణ పనులకు ఉపయోగించే సిమెంట్ బస్తాలు గడ్డకట్టి పాడైపోయాయి.

టెండర్లు రద్దు..

సుమారు 18 శాతం పనులు పూర్తయిన పథకానికి సంబంధించిన టెండర్లను సైతం కూటమి సర్కార్ రద్దు చేసింది. ప్రస్తుత ధరల ప్రకారం మళ్లీ టెండర్లు పిలవడానికి రూ.154 కోట్లతో అంచనాలు వేయించింది. అలాగే గతంలో 'మెగా' కంపెనీ పనులు దక్కించుకోగా... కూటమి ప్రభుత్వం మాత్రం హైబ్రిడ్ యూనిట్ మోడల్ తరహాలో రాయలసీమలోని 8 జిల్లాల్లోని తాగునీటి పనులన్నీ కలిపి ఒకే టెండర్ పిలిచేందుకు సిద్ధమైంది. దీనికి వరల్డ్ బ్యాంకు అనుమతి ఇవ్వడంతో 2029లోపు పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. కానీ జిల్లా కేంద్రమైన పుట్టపర్తి శివారు ప్రాంతాల్లో విపరీతంగా నూతన గృహాలు వెలియడంతో పాటు జనాభా కూడా పెరగడంతో తాగునీటి ఇబ్బందులు తీవ్ర రూపం దాల్చాయి. తాజాగా కూటమి సర్కార్ తాగునీటి పథకం పనులను 2029లోపు పూర్తి చేస్తామని చెబుతుండటంతో ప్రజలంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా తమకు తాగునీరివ్వాలని కోరుతున్నారు.

కమిటీ నివేదిక తర్వాతే పనులు

పుట్టపర్తికి తాగునీరందించే పథకం పనులకు ప్రభుత్వం టెండర్లు పిలవనుంది. త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కానీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల నాటికి పనులు పూర్తి కాకపోవచ్చు. ప్రస్తుతం జరిగిన 18 శాతం పనుల పరిశీలనకు కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. కమిటీ సభ్యులు నాణ్యతను పరీక్షించి నివేదిక ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభిస్తారు.

– నరసింహమూర్తి, డీఈ, పబ్లిక్ హెల్త్



పిల్లర్ దశలో నిలిచిన ట్రీట్‌మెంట్ ప్లాంట్



ట్యాంకు నిర్మాణంలో వాడిన ఇనుప కడ్డీలు తుప్పు పట్టిన దృశ్యం



గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు

ఇసుక ట్రాక్టర్ ఢీ.. విద్యార్థి మృతి

- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన అఖిల్, చిత్రంలో తీవ్రంగా గాయపడిన లోకేష్



అఖిల్ (ఫైల్)

పరిగి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీ కొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ విద్యార్థి మృతి చెందాడు. మరో విద్యార్థి గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని శాసనకోట సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పరిగి మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన రుతుపూర్ణ చక్రవర్తి, గంగాదేవి దంపతుల ఏకైక కుమారుడు అఖిల్ కుమార్(17) హిందూపురంలోని ఓ ఐటీఐ కళాశాలలో చదువుతున్నాడు. ఎప్పటిలాగే బుధవారం ద్విచక్రవాహనంలో కళాశాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తన మిత్రుడు లోకేష్‌తో కలిసి స్వగ్రామం ఊటుకూరుకు బయలుదేరాడు. నేతులపల్లి సమీపంలోని రాగానే పెన్నా, జయమంగళి నదుల సంగమ పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న అఖిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి లోకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్పందించిన స్థానికులు లోకేష్‌ను చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అఖిల్‌కుమార్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ప్రమాదానికి కారణమైన ట్రాక్టరు, డ్రైవరు ఆచూకీ కోసం గాలింపు చర్యలను చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు పుట్టపర్తికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ప్రశాంతి నిలయం: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ గురువారం పుట్టపర్తి రానున్నారు. ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని సాయిఆరామంలో నిర్వహించనున్న మహిళా సంక్షేమం, భద్రత సదస్సులో ఆమె పాల్గొంటారని డీపీఆర్‌ఓ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం అనంతరం సాయి ఆరామంలోనే ఆమె విలేకరులతో మాట్లాడతారని పేర్కొన్నారు.

యథేచ్ఛగా జీరో దందా

నో... 'వే'

- రూ.50 వేలు దాటితే వే బిల్లు ఉండాలనే నిబంధన బేఖాతరు
- పది లక్షల సరుకైనా 48 వేలకే చూపించి పన్ను ఎగవేత
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి



ఎంత సరుకు ఉన్నా రూ.48 వేలే..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీరో బిజినెస్ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. దీంతో ఏటా ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండి పడుతోంది. పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది. ఇక్కడి నుంచి వెళ్లే, ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వచ్చే సరుకుకు వే బిల్లులే ఉండటం లేదు. జీరో బిజినెస్ కారణంగా ఏడాదికి రూ.100 కోట్లకు పైగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని అధికారుల అంచనా. జీఎస్టీ అధికారులకు ఇదంతా తెలిసే జరుగుతున్నా నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు.

రకరకాల మార్గాల్లో సరుకు..

ఉమ్మడి జిల్లాలో ప్రధాన ఆదాయ సర్కిళ్లు అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, గుంతకల్లు. అయితే, ఆయా ప్రాంతాలకు సరుకు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు షాపులకు చేరిపోతుందో అంతు చిక్కని పరిస్థితి. ముఖ్యంగా గ్రానైట్, టైల్స్, సిరామిక్ వంటి సరుకు జీఎస్టీ అధికారులకు తెలియకుండానే అర్ధరాత్రి చేరిపోతోంది. చెక్‌పోస్టుల్లో చెల్లించడం మినహా జీఎస్టీ చెల్లించిన దాఖలాలు లేవు.

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు రోజూ వందల ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు వెళ్తుంటాయి.. వస్తుంటాయి. ఇందులో ప్యాసింజర్ల కంటే సరుకు రవాణా ఎక్కువ. సాధారణంగా సరుకు విలువ రూ.50 వేలు కంటే ఎక్కువ ఉంటే వే బిల్లు విధిగా ఉండాలి. ఉదాహరణకు 30 సెల్‌ఫోన్‌లు కొంటే రూ.3 లక్షలు. కానీ నాలుగు పేర్లమీద బిల్లు వేసి తెస్తారు. రూ. 5 లక్షల సరుకైనా రూ.49 వేల లోపు విలువ చూపించి ఇన్‌వాయిస్‌తో మాత్రమే సరిపెడుతున్నారు.

మార్కెట్‌లో బిల్లులు లేవు..

అనంతపురం, పుట్టపర్తి, హిందూపురం, కదిరి, తాడిపత్రి వంటి పట్టణాల్లో బిల్లులు లేని బిజినెస్సే ఎక్కువ. ఉదాహరణకు అనంతపురంలోని కమలానగర్‌లో ఏ ఒక్క షాపులోనూ కంప్యూటర్ జనరేటెడ్ బిల్లు ఉండదు. మొత్తం చేతిరాతతో ఉండే చిట్టీల పైనే బిల్లులు ఉంటున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో జీరో దందా నడుస్తున్నా అడిగే నాథుడే లేరు. జీఎస్టీ అధికారులను అడిగితే.. తమకు రాష్ట్రస్థాయిలో అధికారులు ఆదేశిస్తేనే వారిపై దాడులు చేస్తామని, లేదంటే చేయలేమని చెబుతున్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు

- కలెక్టర్ టీఎస్ చేతన్



జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా నిరోధంపై సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: మాదకద్రవ్యాల వినియోగం, రవాణాను అరికట్టడానికి జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్నతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిరోధంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వర్కర్లను లక్ష్యంగా చేసుకొని మాదకద్రవ్యాల రవాణా ఎక్కువగా సాగే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచాలన్నారు. గంజాయి నేరస్తులపై 'పీఐటీపీఎన్‌డీపీఎస్ యాక్ట్ 1988' కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డ్రగ్స్ సరఫరా ద్వారా సంపాదించిన ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సీఓటీపీఏ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ప్రతి విద్యా సంస్థలో 'ఈగల్ క్లబ్‌లు' త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఏ మెడికల్ షాపులోనూ ఎన్‌ఆర్‌ఎక్స్ ట్యాబ్లెట్స్ విక్రయించరాదన్నారు. యువత కూడా డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితం నాశనం చేసుకోకూడదన్నారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ వాడకం, రవాణాపై సమాచారం తెలిసిన వారు 1972 టోల్‌ఫ్రీకి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

జిల్లాలో నిఘా పెంచాం

ఎస్పీ రత్న మాట్లాడుతూ... జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఈగల్ టీమ్స్ ద్వారా మాదక ద్రవ్యాల నిరోధం, వాడకంపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లలో డ్రగ్స్ వినియోగం జరగకుండా పర్యవేక్షణ ఉంచాలన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. లోవోల్టేజీ సమస్యలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు

జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి ఉచిత ఇసుక సరఫరా కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్, కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ.. సీసీ రేవు, పీసీ రేవు ఇసుక రీచ్‌లలో రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నదీ ప్రవాహాలకు సమీపంలోని గ్రామాల వారు సొంత అవసరాలకు ఇసుకను తవ్వుకుని తరలించుకోవచ్చన్నారు. సమావేశంలో ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ధర్మవరం ఆర్డీఓ మహేష్, డీపీఓ సమత, భూగర్భ జల శాఖ డీడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నీటిపై పన్నుకు కూటమి కుట్ర



- ఇప్పటికే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన చంద్రబాబు
- త్వరలోనే ఏపీని అమ్మినా ఆశ్చర్య పోనక్కర్లేదు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీరు బాధాకరం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: "ఏడాది పాలనలోనే ఎడాపెడా అప్పులు చేసిన కూటమి సర్కార్.. ప్రజలపై పన్నుల మీద పన్ను వేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే తాగునీటిపై ప్రభుత్వం లోన్లు తీసుకువచ్చింది. వాటిని తీర్చేందుకు వాటర్ మీటర్లు బిగించాలని డీపీఆర్‌లో పేర్కొంది. తాగునీటిపై కూడా ట్యాక్స్‌లను వేసే చరిత్ర గతంలో ఎన్నడు చూడలేదు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌ను సగం తాకట్టు పెట్టింది. త్వరలోనే రాష్ట్రాన్ని అమ్మేసినా ఆశ్చర్యపోవక్కర్లేదు" అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. తొలిఅడుగు అంటూ కూటమి నేతలు తమ ఏడాది పాలన గురించి చెప్పేందుకు జనం వస్తున్నారని, కానీ జనానికి మాత్రం అభివృద్ధి కంటే కూటమి సర్కార్ చేసిన లక్షా యాభై వేల కోట్ల అప్పే కనిపిస్తోందన్నారు. అందువల్లే ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మడం తప్ప మరోదారి లేదని తేల్చేశారన్నారు. ఎన్నికల వేళ అలివిగాని హామీలు గుప్పించిన కూటమి నాయకులు.. అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయలేమని బహిరంగానే చెబుతున్నారన్నారు. ఎన్నికల వేళ రెట్టింపు పథకాలు ఇస్తామన్న నాయకులు, ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్న పథకాలను కూడా సంపూర్ణంగా ఇవ్వలేక పోతున్నారన్నారు. పథకాలు అమలుపై ప్రజల మధ్య చర్చ రాకుండా ఉండేందుకే, వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ... డైవర్షన్ పాలిటిక్స్‌కు కూటమి ప్రభుత్వం తెరలేపిందన్నారు.

పవన్ కల్యాణ్ ఎక్కడున్నారో

రాష్ట్రంలో మహిళల పట్ల దాడులు, అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వాటి గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఆయనకు తన సినిమా ప్రమోషన్‌పై ఉన్న శ్రద్ధ..మహిళల రక్షణపై లేదన్నారు. గతంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ఆరోపించిన పవన్ కల్యాణ్.. డిప్యూటీ సీఎంగా వారిని కనిపెట్టేందుకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. శ్రీకాళహస్తిలో సొంత కార్యకర్తను చంపితే కూడా ఆయన మాట్లాడక పోవడం బాధాకరమన్నారు.

దళిత బిడ్డకు న్యాయం చేయండి

- గిరిజన విద్యార్థిని తన్మయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం వినతి



చైర్‌పర్సన్ శైలజకు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు

అనంతపురం కార్పొరేషన్: మృగాళ్ల చేతిలో అత్యాచారానికి గురైన దళిత బిడ్డకు న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు కోరారు. బుధవారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజను వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులు, గిరిజన మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. దౌర్జన్యాలు, దాడులు అధికమయ్యాయన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన కొందరు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీకి చెందిన గిరిజన విద్యార్థిని తన్మయిని అత్యంత కిరాతకంగా హత్య చేశారన్నారు. ఈ రెండు ఘటనలపై ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేపట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మేరకు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. తన్మయి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలం, వ్యవసాయ భూమి మంజూరు చేయాలన్నారు. అనంతరం శైలజ విలేకరులతో మాట్లాడారు. యువత, అమ్మాయిలపై సినిమాల ప్రభావం తీవ్రంగా ఉంటోందని అన్నారు. అనంతరం ఆమె సామూహిత అత్యాచారానికి గురైప్రభుత్వ సర్వజనాస్పత్రి లేబర్ వార్డులో ఉన్న బాధిత బాలికను ఆమె పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగరాధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, అంజలి, హజర, ఉష, రాధాయాదవ్, భారతి, లీలా, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు చిరంజీవి, నాగరాజు నాయక్, మణికంఠ, సంగమేష్ పాల్గొన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు రాయితీ

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు ప్రత్యేకంగా రాయితీలు అందజేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీ చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రాజెక్టు విలువలో లబ్ధిదారులు 10 శాతం భరిస్తే 35 శాతం ప్రభుత్వ రాయితీ, మిగిలిన 55 శాతం బ్యాంకర్లు రుణం కింద మంజూరు చేస్తారు. గరిష్టంగా రూ.10 లక్షల విలువైన యూనిట్ వరకూ రాయితీ సౌలభ్యం ఉంది. ముఖ్యంగా వేరుశనగ నూనె, చిక్కీల తయారీ, చిప్స్, రోటీ మేకర్, శనగపప్పు, బొరుగుల బట్టీ, తదితర వాటికి రుణాలు మంజూరు చేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు ప్రధానమంత్రి ఆహార శుద్ధి క్రమబద్ధీకరణ పథకం కింద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రిసోర్స్ పర్సన్ అమరనాథరెడ్డి (86868 12438)ని సంప్రదించవచ్చు.

శక్తి యాప్‌పై అవగాహన కల్పించాలి : ఎస్పీ


పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాల్లో విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని శక్తి టీంలను ఎస్పీ రత్న ఆదేశించారు. శక్తి బృందాల పనితీరుపై శక్తి టీంలతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఆమె సమీక్షించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని సెల్‌ఫోన్, డ్రోన్‌ల సాయంతో నేరాల కట్టడికి కృషి చేయాలన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో గస్తీ తిరగాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు సందర్శించి శక్తి యాప్, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులను చైతన్య పరచాలన్నారు. పాఠశాలు, కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు, శక్తి వారియర్స్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్‌ఐలు వలి, మహేష్, ఎస్‌ఐ మునిప్రతాప్, ఐటీ కోర్ టీం ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి .. సాగు సన్నగిల్లి!

- గణనీయంగా తగ్గిన సాగు
- రాయితీ విత్తనాలు అందించడంలో సర్కార్ విఫలం
- మద్దతు ధర, మార్కెట్ సౌకర్యమూ కరువే

అంతర్జాతీయ వాణిజ్య పంటగా గుర్తింపు పొందిన ఉల్లి సాగు జిల్లాలో సన్నగిల్లుతోంది. వివిధ కారణాలతో ఉల్లి సాగుపై రైతులు ఆసక్తి కనపరచడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా పది శాతం కూడా సాగులోకి రాకపోవడమే ఇందుకు నిదర్శనం.





రాయదుర్గం: జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఐదు వేల ఎకరాల్లో, మరి కొన్ని మండలాల్లో కొద్ది మేరకు రైతులు ఉల్లిని సాగు చేస్తున్నారు. ఇందులో ఒక్క గుమ్మఘట్ట మండలంలోనే రైతులు 2 వేల నుంచి 2,500 ఎకరాల్లో ఉల్లిని సాగు చేస్తున్నారు. ఆ తర్వాత వెయ్యి నుంచి 1,500 ఎకరాలతో బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాలు రెండో స్థానంలో నిలిచాయి. మరో 12 మండలాల్లో 2 వేల ఎకరాల్లో ఉల్లి సాగులో ఉంటోంది. అయితే ఈ సారి కనీసం 600 ఎకరాలు కూడా దాటని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పాటికి సుమారు 3 వేల ఎకరాలకు పైగా సాగు చేయాల్సి ఉండగా 10 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలో ఉల్లి సాగులోకి వచ్చింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉల్లి ధరలు ఆకాశానికి అంటడం ఖాయమనే వాదనలు విన వస్తున్నాయి. సాధారణంగా ఉల్లి సాగుకు ఎకరాకు ఐదు లేదా ఆరు కిలోల విత్తనాలు అవసరం కాగా, కిలో విత్తనం నాణ్యత ఆధారంగా రూ.1,800 నుంచి రూ.2,200 వరకు బయట మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కలుపు ఇతర ఖర్చులు వెరసి ఎకరాకు ఎంత తక్కువన్నా రూ.50వేల నుంచి రూ.60 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో కనీస పెట్టుబడులు కూడా చేతికి అందవనే భావన రైతుల్లో వ్యక్తమవుతోంది.

పెట్టుబడుల భారంతో చేతులెత్తేసిన రైతులు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఏటా ఉల్లి సాగు తగ్గుతూ వస్తోంది. లక్షల క్వింటాళ్ల దిగుబడి ఉన్న చోట ప్రస్తుతం వేళ్లతో లెక్కించే పరిస్థితి నెలకొంది. సారవంతమైన భూములు కావడంతో ఎకరాకు 300 నుంచి 350 ప్యాకెట్ల ఉల్లి పండించిన రైతులూ ఉన్నారు. క్వింటా రూ.2 వేలు ధర లభించినా రూ.2 లక్షల నుంచి రూ.2.20 లక్షలు చేతికి దక్కేది. పదెకరాల్లో సాగుచేసిన రైతు రూ.20 లక్షల నుంచి రూ.22 లక్షలకు పైగా ఆదాయాన్ని గడించారు. తాజాగా ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఉల్లి సాగుకు రైతులు మొగ్గు చూపడం లేదు. ఉల్లి విత్తనాలు రాయితీతో అందించడంలోనూ, కనీస మద్దతు ధర ప్రకటించడంలోనూ, సరైన మార్కెట్ సదుపాయం కల్పించడంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలం కావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పండించిన పంటను అమ్ముకోవాలంటే రాజమండ్రి, బెంగళూరు, పూణే లాంటి పెద్ద మార్కెట్లను రైతులు ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికి తోడు కొత్త రకం తెగుళ్ల వెంటాడటం, సరైన అవగాహన లేక ఇష్టారీతిన పురుగు మందులు వినియోగిస్తుండడంతో పెట్టుబడులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో జిల్లా రైతులు చేతులు ఎత్తేయడంతో.. కర్ణాటకలో పండిస్తున్న ఉల్లిపైనే ఆధార పడాల్సి వస్తోంది.

సాగు వదులుకున్నా

మా గ్రామ పరిసరాల్లో ఎంత తక్కువన్నా 300 ఎకరాల్లో పోటాపోటీగా ఉల్లిని రైతులు సాగు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు కనిపించడం లేదు. ఏటా 20 ఎకరాలకు తక్కువ కాకుండా ఉల్లి సాగు చేసే నేనే ఈ సారి సాగు వదులుకున్నా. రెండు ఎకరాలకు విత్తనాలు చల్లుకుంటే ఓసారి వడగళ్ల వర్షం, మరోసారి విత్తన లోపం కారణంగా రూ.40 వేలు నష్టపోయాను. దీంతో సాగు పూర్తిగా వదిలేసి మొక్కజొన్న పెట్టుకున్నాను. అధిక తెగుళ్లు, సరైన విత్తనాల కొరత, మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు ఉల్లి సాగుకు దూరమవుతున్నారు. ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపడితే సాగు విస్తీర్ణం పెంచుకోవచ్చు.

– హరినాథరెడ్డి, ఉల్లి రైతు, ఆర్.కొత్తపల్లి, గుమ్మఘట్ట మండలం

దళిత ద్రోహి ఎంఎస్ రాజు

- దళిత బిడ్డకు న్యాయం చేయలేని అసమర్థుడు
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర ధ్వజం



మాట్లాడుతున్న సాకే చంద్రశేఖర్

అనంతపురం కార్పొరేషన్: ‘శ్రీసత్యసాయి జిల్లా ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత మైనర్ బాలికకు అన్యాయం జరిగితే న్యాయం చేయలేని నువ్వు నిజంగా దళిత ద్రోహివే’ అంటూ మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేసిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులను సన్యాసులంటూ మాట్లాడుతావా? అంటూ మండిపడ్డారు. ఇటీవల ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకుని బాధితురాలికి అండగా నిలవాలని హితవు పలికారు. మైనర్ బాలిక కేసులో 14 మందిని అరెస్ట్ చేసినంత మాత్రనా.. న్యాయం చేసినట్లు కాదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరంలోని అశోక్‌నగర్‌లో ఓ దళిత యువతి హత్యకు గురైతే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించి యువతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఐదెకరాల భూమిని కేటాయించేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సమక్షంలో మృతురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం అందజేసిందన్నారు. ఆ సమయంలో ఉనికి కోసం ఓవరాక్షన్ చేసిన టీడీపీ నాయకులు.. నేడు ఓ దళిత మైనర్ బాలికకు, మరో గిరిజన యువతికి అన్యాయం జరిగినా కనీసం నోరు కూడా మెదపడం లేదన్నారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కూటమి ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎవరెన్ని కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా భయపడే ప్రసక్తి లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, ఎస్సీ సెల్ శింగనమల నియోజకవర్గ అధ్యక్షుడు అంజి, పార్టీ నగర కార్యదర్శి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

- ఆటో డ్రైవర్లకు ఎస్పీ రత్న సూచన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రయాణికులను గమ్య స్థానానికి చేర్చడమే కాకుండా వారి పట్ల సామాజిక బాధ్యతతో మెలగాలని ఆటో డ్రైవర్లకు ఎస్పీ రత్న సూచించారు. ఆటో డ్రైవర్లకు భద్రత– బాధ్యత అనే అంశంపై బుధవారం సాయి ఆరామంలో అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఎస్పీ రత్న, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. సత్యసాయి శతజయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, వారిని రవాణా చేయడంలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. ఇలాంటి తరుణంలో ఆటోలు నడిపే సమయంలో తమ కుటుంబాలతో పాటు ప్రయాణికుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. చిన్నారులతో, విద్యార్థులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఆటోకూ వెహికల్ ట్రాఫికింగ్ సిస్టమ్ తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం రెండు, మూడు భాషలపై పట్టు కలిగి ఉండాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అడ్డుకోవడంలో ఆటోడ్రైవర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. అసాంఘిక శక్తుల సమాచారాన్ని పోలీసులకు చేరవేయడంలో ఆటో డ్రైవర్లు ముందుండాలన్నారు. ఎంవీఐ వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించే వారికి ప్రభుత్వాలు అందజేసే పారితోషకంపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఫైరోజాబేగం మాట్లాడుతూ.. గుట్కా, పాన్‌పరాగ్, గుట్కా, మద్యం వంటి వాటి వల్ల ప్రాణాంతకమైన జబ్బులబారిన పడే ప్రమాదముందని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్, పుట్టపర్తి నల్లమాడ, పుట్టపర్తి సీఐలు సునీత, నరేంద్రరెడ్డి, సురేష్, మారుతీశంకర్, ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది, 800మంది ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సంతకాల కోసమే పనికొస్తామా?

- గౌరవం లేదు.. గౌరవ వేతనమూ లేదు
- 22 నెలలుగా ఎంపీటీసీలకు అందని వేతనం
- అధికారులను నిలదీసిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



అధికారులను చుట్టుముట్టి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మవరం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు చెల్లించడం లేదని, పంచాయతీల అభివృద్ధికి సైతం నిధులను మంజూరు చేయకుండా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారంటూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. బుధవారం ధర్మవరం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశాన్ని గంట పాటు బహిష్కరించి ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్‌ను చుట్టుముట్టి ఘెరావ్ చేశారు. ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే పంచాయతీల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. గ్రామాలలో తాగునీరు, వీధిలైట్లు, రహదారుల నిర్మాణాలు తదితర మౌలిక వసతుల కోసం నిధులు అడిగితే పైసా కూడా లేదని అధికారులు చెపుతున్నారంటూ సర్పంచ్‌లు మండి పడ్డారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లిందేకు కూడా నిధులు మంజూరు చేయకుంటే ఎలా నిలదీశారు. గ్రామాలలో ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఆహ్వానించకుండా పార్టీ నాయకులను అందలం ఎక్కిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదన్నారు. 22 నెలలుగా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించకుండా సహనాన్ని పరీక్షిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కుబడిగా జరిగే మండల సర్వ సభ్య సమావేశాలకు ఆహ్వానించి రిజిస్టర్‌లో సంతకాలు చేయించుకుంటున్నారని, బయటి కార్యక్రమాల్లో తమకు ఎలాంటి గౌరవం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. గ్రామాలలో సర్పంచ్‌ల తీర్మానాలు లేకుండానే ఉపాధి హామీ పథకం పనులు చేయిస్తున్నారన్నారు. దీంతో స్పందించిన ఎంపీడీఓ.. త్వరలోనే ప్రజాప్రతినిధులకు వేతనాలు చెల్లించడం జరుగుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలకు గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రాధాన్యతను ఇస్తామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

గూగూడులో ‘హుండీ మాయం’!

- భక్తులు, గ్రామస్తుల ఆందోళన
- సీసీ ఫుటేజీ చూపాలని కోరితే ఈఓ పొంతనలేని సమాధానం
- ఆమెకు టీడీపీ నాయకుల వత్తాసు పలకడంపై సర్వత్రా అనుమానాలు



ఈఓ సమక్షంలోనే విలేకర్లపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నాయకులు

నార్పల: మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూగూడులో హుండీ మాయమైన ఘటన కలకలం రేపింది. గూగూడు కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో తాత్కాలికంగా నాలుగు హుండీలు ఏర్పాటు చేశారు. వాటిలో మూడింటిని ఈ నెల 18న తెరిచి కానుకలను లెక్కించారు. తర్వాత ఆ హుండీలను ఓ ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు. ఈ క్రమంలో లెక్కించని నాలుగో హుండీని కూడా తరలించినట్లు తెలిసింది. గూగూడు గ్రామస్తుల నుంచి కూడా దీనిపై ఆరోపణలు వచ్చాయి. ఇదే క్రమంలో ట్రాక్టర్‌లో హుండీలను తరలిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.

ఈఓకు టీడీపీ నాయకుల వత్తాసు..

‘హుండీ మాయం’ ఘటనపై బుధవారం దేవదాయ శాఖ ఈఓ శోభారాణి గూగూడులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లు సీసీ కెమెరా ఫుటేజీ చూపాలని, దీంతో అనుమానాలన్నీ తొలగిపోతాయని ఈఓను కోరగా.. పొంతనలేని సమాధానాలిచ్చారు. ఈ క్రమంలోనే ఆమె వెంటే ఉన్న టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. విలేకర్లపై దురుసుగా ప్రవర్తించారు. ఈఓకు టీడీపీ నేతలు వత్తాసు పలకడం సర్వత్రా అనుమానాలకు తావిచ్చింది. టీడీపీ నేతలను ఎందుకు వెంట తెచ్చుకున్నారని ఈఓను ప్రశ్నిస్తే.. వారు అనధికారిక కమిటీ మెంబర్లంటూ ఆమె సమాధానం చెప్పడం గమనార్హం. ఏదిఏమైనా రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన గూగూడు ఆలయంలో హుండీ మాయమైన ఘటన గ్రామస్తులు, భక్తులకు ఆందోళన రేకెత్తిస్తోంది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సీసీ ఫుటేజీని బయటకు తీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు క్రాస్ వద్ద 544ఈ జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో గోరంట్ల మండలం గౌనిపల్లికి చెందిన అంజినప్ప (70) అక్కడికక్కడే మృతి చెందాడు. చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహన దారుడు అక్కడి నుంచి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

బాలుడి దుర్మరణం



మృతుడు సురేష్‌రెడ్డి

సోమందేపల్లి: మండలంలోని వెలుగుమాకులపల్లి గ్రామ సమీపంలో బస్సును ద్విచక్రవాహనం ఢీ కొన్న ఘటనలో ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురం మండలం బాలంపల్లికి చెందిన రాజురెడ్డి కుమారుడు నరేష్‌రెడ్డి(14) రాచూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ద్విచక్ర వాహనంపై పాలసముద్రం వైపు వెళుతూ వెలుగుమాకులపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

ప్రాణహాని ఉంది.. కాపాడండి

- భార్య, ఆమె ప్రియుడిపై బాధితుడి ఫిర్యాదు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అప్పగించినా స్పందించని పోలీసులు
- భార్య ఫిర్యాదు చేస్తే గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేస్తామంటూ బెదిరింపులు
- న్యాయం చేయాలంటూ వేడుకుంటున్న బాధితుడు

హిందూపురం: తన భార్య, ఆమె ప్రియుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఓ భర్త వాపోయాడు. ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని, పైగా భార్య ఫిర్యాదు చేస్తే గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసి, జైలుకు పంపిస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం ‘సాక్షి’తో బాధితుడు మాట్లాడుతూ తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీలో నివాసముంటున్న రామకృష్ణ.. ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానన్నారు. ఈ క్రమంలో తాను విధులకు వెళ్లగానే తన భార్య.. ప్రియుడిని రప్పించుకోవడం పరిపాటిగా మారిందన్నారు. ఈ విషయంపై పలుమార్లు ఆమెకు నచ్చచెప్పినా ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. గత శనివారం మరో డ్రైవర్ తనను రిలీవ్ చేయడంతో రాత్రి 9.30 గంటలకు ఇంటికి చేరుకున్నానన్నారు. అప్పటికే ఇంట్లో తన భార్య, ఆమె ప్రియుడు శ్రీకాంత్ ఏకాంతంగా ఉండడం గమనించి, బంధువుల సాయంతో వారిని అదే రోజు రాత్రి 1 గంటల సమయంలో వన్‌టౌన్ పీఎస్‌కు పిలుచుకెళ్లి ఫిర్యాదు చేశానన్నారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న పోలీసులు ఉదయాన్నే రావాలని తెలపడంతో తన భార్య, ఆమె ప్రియుడిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి ఇంటికి చేరుకున్నామన్నారు. మరుసటి రోజు ఉదయాన్నే పోలీసు స్టేషన్‌కు వెళితే.. కేసు నమోదు చేసి, తన సంసారాన్ని నిలబెట్టాల్సిన పోలీసులు ఇందుకు విరుద్ధంగా మాట్లాడారని వాపోయాడు. తనకు వ్యతిరేకంగా భార్య ఫిర్యాదు చేస్తే గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసి, జైలుకు పంపాల్సి వస్తుందని, చట్టాలు మహిళలకే వర్తిస్తాయని బెదిరింపులకు దిగారన్నారు. మహిళలు తప్పు చేసినా.. చట్టాలు వారిపై మొగ్గుచూపుతున్నాయని నచ్చచెప్పే ప్రయత్నం చేశారన్నారు. తన భార్య, ఆమె ప్రియుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని మొరపెట్టుకున్నా పోలీసులు ఏకపక్షంగా తనపై కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

యువతి అదృశ్యం

కదిరి టౌన్: స్థానిక గొల్లమ్మ మంటపం వద్ద నివాసముంటున్న బాల రాధమ్మ కుమార్తె బి.మౌనిక బుధవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం దుకాణానికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన యువతి.. తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవళం బజారులో నివాసముంటున్న లక్ష్మీనారాయణ కుమారుడు రెడ్డప్పతో తన కుమార్తె చనువుగా ఉండేదని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కదిరి పట్టణంలోని అడపాల వీధికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో నర్సింగ్ చేస్తున్న అడపాల వీధికి చెందిన లింగాల ఈశ్వరయ్య కుమార్తె నవ్య రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చింది. మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో యువతి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

రైతు బలవన్మరణం



రామ్మూర్తి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సీకేపల్లి మండలం నామాల గ్రామానికి చెందిన రామ్మూర్తి (38)కి భార్య అంజలి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకున్న మూడెకరాల పొలంలో అప్పులు చేసి 4 బోరు బావులు వేసి పంటలు సాగుతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పంటల సాగు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.15 లక్షలకు చేరుకున్నాయి. అప్పులు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో మనస్తాపం చెందిన రామ్మూర్తి రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న రామ్మూర్తిని వెంటనే అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు కర్నూలుకు తరలించారు. చికిత్స స్పందించక బుధవారం సాయంత్రం ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు వెంకటరమణ

తలుపుల: మండలంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న ఎస్.వెంకటరమణ (42) ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాది క్రితం తన పెద్దకుమారుడు అనారోగ్యానికి గురి కావడంతో బంగారునగలు తాకట్టు పెట్టి చూపించాడు. అనంతరం తల్లి చనిపోయింది. ఈ క్రమంలో అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన ఆయన బుధవారం ఊజీ గుళికలు మింగి విషయాన్ని భార్యకు తెలిపాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.